క్లుప్తంగా

ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి

కొల్లిపర: వేసవిలో నీరు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి తూములూరు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. శనివారం పోషణ్ పక్షోత్సవంలో భాగంగా తూములూరు సెక్టార్‌లోని చివలూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరుకు చెందిన మెగాస్టార్ చిరంజీవి అభిమాని గోపిశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. మృతుని కుటుంబానికి పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ సభ్యులు శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుని స్నేహితుడు హరికృష్ణ ఆర్థికసాయం అందించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు పొన్నెకంటి చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో నీలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురులో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో శనివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలపర్తి వెంకయ్య పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య కళాశాల ద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెనాలిలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్స్ బి.తిరుపతిరావు, ఆర్.శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్.హేమంత్ అభిరామ్ జోనల్ లెవల్ 18వ ర్యాంకు, వై.వంశీ ఆదిత్య, కె.యశ్వంత్, ఐ.శివశంకర్ మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. వీరిని శనివారం కళాశాల ఆవరణలో అభినందించారు.

రేపటి నుంచి ఉపాధ్యాయుడి పల్లె నిద్ర

తెనాలి: తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరుతూ మైక్ ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య ఆ క్రమంలోనే పాఠశాల/పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో చుండూరు మండల గ్రామం వేటపాలెంలో పల్లె నిద్ర చేస్తానని బట్టు వెంకయ్య శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు.


25న శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని రజక పార్కు వద్ద ఉన్న శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈనెల 25వ తేదీ నిర్వహించనున్నారు. ఉదయం బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకంతో కార్యక్రమాలను ఆరంభిస్తారు. గణపతి హోమం, నవగ్రహ హోమం, మహామృత్యుంజయ హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీకామాక్షమ్మ అమ్మవారికి లక్ష మల్లెపూలతో(శ్రీలలితా సహస్ర నామాలతో) విశేషపూజలు చేస్తారు. వేదపండితుడు తంగెళ్ల మారుతి వెంకట ప్రసాద్, ప్రతాపగిరి ప్రదీక్‌కుమార శాస్త్రి పర్యవేక్షణలో ఈ వేడుకలు జరుగుతాయి. పూజానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కండి

తాడేపల్లి రూరల్: నేటి యువతరం సమాజ అభివృద్ధిలో భాగస్వాములై ఆదర్శంగా నిలవాలని తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు కోరారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో యువకులతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని కోరారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

కోర్టుకు హాజరు కాని నిందితుడి అరెస్ట్



మంగళగిరి: వారెంట్ ఉన్నా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూరల్ ఎస్సై వెంకట్ తెలిపిన వివరాల మేరకు.. యర్రబాలెం గ్రామానికి చెందిన వాసా వెంకటేశ్వరరావు ఓ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్‌ను కోర్టు విధించిందని ఎస్సై తెలిపారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో

పిల్లలు, గర్భిణులకు ప్రమాదం

- సబ్ కలెక్టర్ సంజనా సింహ
- తెనాలిలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం
- 11.5 టన్నుల పాత ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరణ



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ సంజనా సింహ, చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పాడైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరైన పద్ధతిలో తొలగించకపోతే వాటి నుంచి వెలువడే రసాయనాల వలన చిన్న పిల్లలు, గర్భిణులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని సబ్ కలెక్టర్ సంజనా సింహ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈ వ్యర్థాల సేకరణను శివాజీచౌక్‌లో శనివారం నిర్వహించారు. తొలుత గాంధీచౌక్ నుంచి శివాజీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను శాస్త్రీయ పద్ధతిలో తొలగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వీటిని సరైన పద్ధతిలో తొలగించకపోతే వాటి నుంచి వెయ్యి రకాల ప్రమాదకరమైన రసాయనాలు వెలువడతాయని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ఇ-వ్యర్థాల తొలగింపుపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ 2022 నాటికి 8 కోట్ల టన్నుల ఇ-వ్యర్థాలు ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తన నివేదికలో వెల్లడించిందని తెలిపారు. ఇందులో 20 మిలియన్లు టన్నులు మాత్రమే రీసైక్లింగ్ జరుగుతున్నట్లు చెప్పారు. మిగిలినవి ఆ శాస్త్రీయ విధానంలో తొలగించడం వలన మానవాళి మనుగడకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఇ-వ్యర్థాలను తమకు అందజేస్తే సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ప్రజలకు ముప్పువాటిల్లకుండా చూస్తామన్నారు. శనివారం మొత్తం 11.05 టన్నుల వ్యర్థాలను సేకరించినట్లు చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గుమ్మడి ప్రసాద్, అనుపమ, మెప్మా సీఎంఎం విజయకుమారి, టీపీఓ సాంబశివరావు పాల్గొన్నారు.



15వ వార్డులో పాత ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరిస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది



జిల్లా వైద్యశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి

■ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన అనేక ఇబ్బందులు ఉన్నాయని 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 15వ వార్డులో ఈ వ్యర్థాల సేకరణను నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్ళి పాత ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, 15 వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

■ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పిలుపునిచ్చారు. జిల్లా వైద్యశాలలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వినీల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు హానికర వ్యర్థాలను తొలగించాలి

తెనాలిటౌన్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలు వ్యర్థాలను ఇళ్ల నుంచి తొలగించాలని డివిజనల్ పంచాయతీ అధికారి వి.స్వరూప పిలుపునిచ్చారు. రూరల్ మండలం పెదరావూరులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి వి.స్వరూప, ఎంపీడీఓ అత్తోట దీప్తి పాల్గొని మాట్లాడారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాల నిర్మూలన కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వైవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర భాగస్వాములు కావాలి

తెనాలిరూరల్: స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీఓ కె.శ్రీహరి ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్రతిరోజు సిబ్బంది ఉపయోగించే కంప్యూటర్లు, ఫర్నిచర్ శుభ్రం చేసి, కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్టీఓ సిబ్బంది, కార్యాలయానికి వచ్చిన వారితో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.మధుసూదన్ రావు, జి. అమృతవాణి, సిబ్బంది రాధాబాయి, రమాదేవి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొల్లిపర: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు మృత్యుంజయ రావు అన్నారు. శనివారం కొల్లిపర గ్రామంలోని ప్రాథమిక పాఠశాల రెగ్యులర్‌లో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశీలన పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమంతోపాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరీమున్, నూర్జీ హాన్, స్వర్ణ కుమారి, సీఆర్పీ రమేష్ బాబు పాల్గొన్నారు.



కార్యాలయ ఫర్నిచర్‌ను శుభ్రం చేస్తున్న ఆర్టీఓ శ్రీహరి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రీజియన్‌లోని రోటరీ క్లబ్‌ల బాధ్యులకు శిక్షణ

తెనాలి: 2025-26 సంవత్సరానికి అమరావతి రీజియన్‌లోని 30 రోటరీ క్లబ్‌లకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులకు శనివారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్సు హాలులో శిక్షణ సమావేశం నిర్వహించారు. రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ 2025-26 డిస్ట్రిక్ట్ గవర్నర్ సోమవరపు రాంప్రసాద్, ప్రస్తుత డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, పీడీజీలు అన్నే రత్నా ప్రభాకర్, వడ్లమాని రవి, వంగల రమేష్, జాస్తి రంగారావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ అనిత రెడ్డి, బిబో శ్రీనివాస్ పాల్గొన్నారు. అధ్యక్ష, కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. రొటేరియన్ అన్నే శివ కుమారి స్వాగతం పలికారు. రోటరీ క్లబ్ ఫౌండర్ పాల్ హరీష్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన్ను స్మరించుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కన్వీనర్ కన్నెగంటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జాయింట్ సెక్రెటరీ గుత్తా వెంకటరత్నం, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ పర్యవేక్షించారు.



పాల్‌హరీష్ జయంతి కేక్ కట్‌చేసిన డిస్ట్రిక్ట్ గవర్నర్

మహిళను వేధించిన వ్యక్తి అరెస్ట్

మంగళగిరి: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూరల్ ఎస్సై వెంకట్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన రుద్రు సతీష్ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భార్యను రెండు సంవత్సరాలుగా వేధిస్తున్నాడు. ఆ వ్యక్తిని కూడా బెదిరిస్తున్నాడు. ఆ వేధింపులు తట్టుకోలేక బాధితుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సతీష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దేశ సమైక్యతను కాంక్షిస్తూ ర్యాలీ

మంగళగిరి టౌన్: దేశ సమైక్యత కోసం వాక్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్రైస్తవ ఐక్య వేదిక కో ఆర్డినేటర్లు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీ చేపట్టారు. గౌతమ బుద్ధ రోడ్ మీదుగా పాత బస్టాండ్, పాత మంగళగిరి, రాజీవ్ సెంటర్, నాంచారమ్మ చెరువు, గాలిగోపురం మీదుగా తిరిగి ఈద్గా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ ఐక్యవేదిక కో ఆర్డినేటర్లు కేకే రవికుమార్, తిమోతి, రవిప్రకాష్, కన్వీనర్లు మణి, దయా రత్న కుమార్, ఫెలోషిప్ బోర్డు మెంబర్లు వివేక్, రూఫస్, పలు చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలో శనివారం పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యుల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో శాంతిని, క్రైస్తవుల ఐక్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని సభ్యులు తెలిపారు. అనంతరం మార్నింగ్ స్టార్ కళాశాల నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.



మంగళగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తప్పిన ప్రమాదం



మంగళగిరి: పట్టణంలోని స్క్రూబ్రిడ్జి వద్ద ఆటో బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి మంగళగిరి వస్తున్న ఆటోలో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. స్క్రూబ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆటోలోని ప్రయాణికులు, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కొనసాగిన కార్మికుల దీక్ష



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శనివారం 137వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వచ్చి కార్మికులకు మద్దతు తెలిపారు. తర్వాత మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసిందని గుర్తుచేశారు. దాంతో దాదాపు 300 కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఎం.గురవయ్య, మాణిక్యరావు, హగ్గయ్య, యెహోషువా, సారమ్మ, ఇమాంబి, దుర్గాభవాని, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవస్థలపై కార్యశాల

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బీసీఏ, ఎంసీఏ విభాగాలు సంయుక్తంగా కేఎల్‌ఏసీఐసీ సహకారంతో విద్యార్థులకు కార్యశాలను శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సుబ్రహ్మణ్యం, బీసీఏ విభాగాధిపతి డాక్టర్ భగవాన్‌లు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు, నూతన వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో కావాల్సిన నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు ఈ కార్యశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యశాలలో తెలుగు రాష్ట్రాలలో వివిధ స్టార్ట్ అప్‌లను నిర్వహిస్తున్న ఎన్‌పిరోడాక్స్ సీఏఓ మాదాల భరత్‌కుమార్, స్పాట్ టైం సీఏఓ సతీష్ కుమార్, ఇంపాక్ట్ వ్యవస్థాపకుడు ఫణిరామ్ నాగార్జున, మాగ్నమైన్ వ్యవస్థాపకుడు సందీప్, ఇంటర్వ్యూ బడ్డీ వ్యవస్థాపకుడు ఉజ్వల్‌లు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని, అవగాహన కల్పించారని తెలిపారు. సహకరించిన కేఎల్ ఏసీఐసీ సీఈఓ రమణ్‌కాంత్, హరికృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎంసీఏ విభాగాధిపతి కిరణ్, బీసీఏ విభాగాధిపతి డాక్టర్ భగవాన్, కేఎల్‌యూ ఏసీఐసీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రభుదేవ్, అధ్యాపకులు రామకృష్ణ, కిరణ్‌బాబు, సిద్ధార్థ రెడ్డి, నాగేంద్ర, ఫణికాంత్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ కె. సుబ్రహ్మణ్యం

జాబ్ మేళాలో 25 మందికి ఉద్యోగాలు



ఫిరంగిపురం: విద్యార్థుల భవిష్యత్తుకు జాబ్ మేళాలు ఎంతో దోహదం చేస్తాయని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.మేరి అన్నారు. మండల కేంద్రంలోని దీనాపూర్ ప్రాంగణంలోని సెయింట్ జేవియర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శనివారం దివీస్ ఫార్మసీ (హైదరాబాద్) వారిచే జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 25 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.జీవన్ మణిబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ కె.మేరి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మెర్సిరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

కొల్లిపర: ప్రభుత్వ పాఠశాలలో బలమైన విద్యా పునాదులు పడడమే కాకుండా నాణ్యమైన బోధన లభిస్తోందని మున్నంగి క్లస్టర్ హెచ్‌ఎం అప్పారావు అన్నారు. శనివారం మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(రెగ్యులర్) లో ప్రధానోపాధ్యాయుడు రాము అధ్యక్షతన ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యసన స్థాయి మెరుగుపడాలంటే తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. గతం కంటే ఇప్పుడు స్కూళ్లలో నాణ్యత ప్రమాణాలు ఎక్కువగా ఉన్నాయని సంగతిని ఎవరు కాదనలేరని చెప్పారు. మున్నంగికి చెందిన ఆళ్ల గోపిరెడ్డి 4,5 తరగతులు విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. 1,2,3 తరగతుల విద్యార్థులకు స్కూలు తరఫున నగదు అందజేశారు. వేసవిలో విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ప్రతి ఒక్క విద్యార్థికి పాఠశాల తరఫున క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. హైస్కూల్ ఉపాధ్యాయుడు సాంబశివరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు నూతన వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని సోమరౌతు లక్ష్మీ కమల, భార్గవి, దివ్య, లక్ష్మి పాల్గొన్నారు.



క్రీడ సామగ్రితో విద్యార్థులు

అగ్ని ప్రమాదాల్లో సమయస్ఫూర్తి అవసరం

తెనాలిరూరల్: అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెనాలి ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి కోటిరెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని హ్యాపీ హాస్పటల్‌లో సిబ్బంది, రోగులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు వెంటనే చేట్టాల్సిన చర్యల గురించి వివరించారు. వైద్యశాలలో ఉండే అగ్నిమాపక యంత్రాలను వినియోగించే తీరును ప్రదర్శించారు.



ప్రమాద సమయంలో రోగులను తరలించే తీరును వివరిస్తున్న సిబ్బంది

దివ్యాంగులకు రోటరీ క్లబ్ ‘శ్రీపాదం’ ప్రాజెక్ట్

- సౌకర్యవంతమైన కృత్రిమ కాళ్ల ఉచిత పంపిణీ
- తెనాలిలో ప్రమోషన్ పోస్టర్ ఆవిష్కరణ

తెనాలి: రోటరీ క్లబ్ మంగళగిరి, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సంయుక్తంగా దివ్యాంగుల కోసం శ్రీపాదం ప్రాజెక్టు చేపట్టారు. జైపూర్‌లో చేయించిన ప్రత్యేకమైన మోకీలు వ్యవస్థ కలిగిన ‘ప్రభ ఫుట్’ (కృత్రిమ కాలు)ను 120 మంది దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. తెనాలిలో శనివారం నిర్వహించిన రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి వివరాలు వెల్లడించారు. ఈ కత్రిమ కాలును ఉపయోగించి నడవడం, మెట్లు ఎక్కడం, కాలును మడిచి కూర్చోవడం వంటి దైనందిన కార్యకలాపాలను దివ్యాంగులు సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. కాలు లేని దివ్యాంగులు 72074 03150 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జూన్ 9 నుంచి 15వ తేదీ వరకు మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న శిబిరంలో, కృత్రిమ కాళ్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ గురు రవి వడ్లమాని, పూర్వ గవర్నర్లు అన్నె రత్నప్రభాకర్, రమేష్ వంగల, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, రోటరీ క్లబ్ మంగళగిరి ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ అందె మురళీ మోహనరావు, ప్రెసిడెంట్ ఎలక్ట్ ప్రెగడ రాజశేఖర్, సెక్రటరీ ఎలెక్ట్ పారేపల్లి నిరంజన్ గుప్తా పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన శరత్‌చౌదరి, రాంప్రసాద్

ఆర్టీఓను సత్కరించిన కారు యజమాని

తెనాలిరూరల్: నెలలుగా పరిష్కారం కాని సమస్యను కొన్ని నిమిషాల్లోనే పరిష్కరించిన తెనాలి ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కె. శ్రీహరిని ఓ కారు యజమాని సత్కరించాడు. తిరుపతి నుండి వచ్చి ఆర్టీవోను కలసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన కొండపల్లి రాజేంద్రకుమార్ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తూ తిరుపతిలో ఉంటున్నాడు. వీరి కుటుంబానికి చెందిన కారు ఆర్‌సీ గడువు పూర్తవగా, గడువు పెంపు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆర్‌సీ కార్డు జారీ అయింది మినహా సాంకేతిక కారణంతో ఆన్‌లైన్‌లో వాహన్ పోర్టల్‌లో నమోదు కాలేదు. పలుమార్లు ఇక్కడి కార్యాలయంలో, ఆన్‌లైన్ ద్వారా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తెనాలి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఫోన్ నంబరు తెలుసుకున్న రాజేంద్రకుమార్, తన సమస్య గురించి మెసేజ్ చేయడంతో పాటు, ఫోన్ చేసి వివరాలు తెలియజేశాడు. వివరాలు నమోదు చేసుకున్న ఆర్టీఓ శ్రీహరి కేవలం 30 నిమిషాల్లో సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో తిరుపతి నుంచి శనివారం వచ్చిన రాజేంద్రకుమార్ ఆర్టీఓను ఆయన కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు వీరితో ఉన్నారు.



ఆర్టీఓ శ్రీహరిని సత్కరిస్తున్న రాజేంద్రకుమార్

అగ్నిప్రమాదాలపై అవగాహన

చినకాకాని (మంగళగిరి): అగ్నిమాపక అవగాహన వారోత్సవాలలో భాగంగా శనివారం నగర పరిధిలోని చినకాకాని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రికి అగ్నిప్రమాదాలకు గురైన బాధితులు వచ్చిన సమయంలో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, ఆసుపత్రిలో ప్రమాదం జరిగితే రోగులను ఎలా రక్షించాలి వంటి అంశాలను వివరించారు.